19 NOV 2020 SAKSHI

## సంక్షేమ పథకాలు అర్హులకే అందాలి

యానాం: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలు అర్హులకే అందాలని ఆ విధంగా పుదుచ్చేరిలో సాంఘిక సంక్షేమ అధికారులతో విచారణ నిర్వహిస్తే 60 శాతం లబ్ధిదారులు అనర్హులుగా ఉన్నారని ఎల్జీ కిరణ్‌బేడీ బుధవారం ప్రకటనలో అన్నారు. కొన్ని సంవత్సరాలుగా తప్పుడు సమాచారాన్ని ఇస్తూ పథకాల లబ్ధి పొందుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. తక్షణం వీటి తనిఖీలకై బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజా ధనాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు.

## ఓటరుగా నమోదు కావాలి

యానాం: త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని ఇన్‌చార్జి పరిపాలనాధికారి గుజ్జు గౌరీసరోజ బుధవారం ప్రకటనలో సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఇప్పటికే ప్రారంభమైందని డిసెంబర్ 15 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు నమోదు చేయించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని, అర్హులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని ఆమె కోరారు.

## యానాంలో...

యానాం: దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తిక శుద్ధ చవితి నాడు జరుపుకునే నాగులచవితి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సర్పాలకు అధిపతి అయిన నాగరాజును నాగదేవతగా పూజించడం ఆనవాయితీగా వస్తుంది. నియోజకవర్గ పరిధిలో పలు చోట్ల అధిక సంఖ్యలో మహిళలు పుట్టల వద్దకు వెళ్లి ఆవుపాలు పోసి, గుడ్లు, అరటిపండ్లు, తాటి బుర్ర గుంజులు, తేగలు మొదలైనవి నివేదనగా ఉంచి విశేష పూజలు చేశారు. అదేవిధంగా దీపావళి సందర్భంగా మిగిలిన మతాబులు, కాకర పువ్వొత్తులు, టపాసులు తదితర వాటిని పుట్టల వద్ద కాల్చారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడు కాలనీ, మెట్టకూరు, బెజవాడా గార్డెన్స్ తదితర చోట్ల అధిక సంఖ్యలో మహిళలు పూజలు నిర్వహించారు.



యానాంలో పుట్ట వద్ద పూజలు

## జీఎస్టీ పరిహారం విడుదల చేయాలి

యానాం: పుదుచ్చేరికి ఏడు నెలలుగా బకాయి ఉన్న జీఎస్టీ పరిహారాన్ని విడుదల చేయాలని పుదుచ్చేరి సీఎం నారాయణసామి బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జీఎస్టీ పరిహారం అందక పలు సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని రావాల్సిన రూ.700 కోట్ల జీఎస్టీ పరిహారాన్ని చెల్లించాలన్నారు. ప్రపంచ బ్యాంకు సహాయంతో సునామీ సహాయక ప్రాజెక్టులు కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో ఆలస్యమయ్యాయని అన్నారు. కేబినెట్ తీర్మానం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించే ఫైలును ఎల్జీ కిరణ్‌బేడీ కేంద్ర ప్రభుత్వానికి పంపడంపై హోం కార్యదర్శి వద్ద లేవనెత్తినట్లు తెలిపారు. కేంద్రం సైతం కేబినెట్ నిర్ణయానికి ఎటువంటి అడ్డంకులు కల్పించకుండా సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రులు మల్లాడి కృష్ణారావు, కందసామి తదితరులు పాల్గొన్నారు.

## బాలలపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన శిక్ష



చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా వేదిక

యానాం: బాలలపై లైంగిక దాడులకు పాల్పడితే ఫోక్సో చట్టం–2012 ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని ఎస్పీ భక్తవత్సలన్ అన్నారు. చైల్డ్‌లైన్ దోస్తీ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో బాలల అవసరాలు, సమస్యలు, సలహాలపై అధికారులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలలకు ఎలాంటి సమస్య వచ్చినా 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అందరూ చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ లక్ష్మీబాయ్, జేజేబీ సభ్యులు స్వరాజ్యలక్ష్మి, ఉషారాణి, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ రాము, ఐటీఐ ప్రిన్సిపాల్ లంక చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

19 NOV 2020

## కర్ఫ్యూ ఎత్తివేత

యానాం: కొవిడ్-19 ఆంక్షలు నేపథ్యంలో పుదుచ్చేరి వ్యాప్తంగా అమలులో ఉన్న రాత్రి వేళ కర్ఫ్యూను ఎత్తివేస్తున్నట్లు కలెక్టర్ టి. అరుణ్ ఆదేశాలు జారీ చేశారు. సినిమా థియేటర్లు, మద్యం దుకాణాలు, ఇతర వినోదాలపై ఈ నెల 30 వరకు విధించిన ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

## బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

యానాం: బాలల హక్కులు, రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎస్పీ భక్తవత్సలం అన్నారు. ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ, చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో 'బాలల అవసరాలు, సమస్యలు, సలహాలు' అంశంపై బుధవారం నిర్వహించిన చర్చా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ENADU

19 NOV 2020

## కొవిడ్ అనంతర వ్యాధులు, చికిత్సపై దృష్టి

యానాం: కరోనా వచ్చి కోలుకున్న తర్వాత ఇతర రోగాలతో బాధపడుతున్న వారిపై దృష్టి సారించి.. చికిత్స అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27 వేల మంది ఆరోగ్య వివరాలు సేకరించామన్నారు. 3,542 మంది ఇతర రోగాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని.. వీరికి ప్రత్యేక చికిత్స అందిస్తామన్నారు.

PRAJA SAKTHI

19 NOV 2020

## 'లైంగిక దాడులు బాధాకరం'

ప్రజాశక్తి - యానాం

రోజురోజుకూ బాలలపై లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని యానాం ఎస్పి భక్తవత్సలన్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ చైల్డ్ లైన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమాజంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. లైంగిక వేధింపులు,, గంజాయి వంటి సమాజ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. బాలలకు ఎలాంటి సమస్యలున్నా 1098కి ఫోన్ చేసి సమచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి.రెడ్డి, చైర్ పర్సన్ లక్ష్మీబాయ్, డి.సత్యనారాయణ, స్వరాజ్యలక్ష్మి, ఉషారాణి, కో–ఆరినేటర్ పి.రాము, ప్రిన్సిపల్ ఎల్.చంద్రరావు పాల్గొన్నారు.

వెలుగు 19 NOV 2020
VELUGU
VELUGU

### పుదుచ్చేరిలో రాజుకుంటున్న

# ఎన్నికల వేడి

## పొత్తుల కసరత్తుల్లో రాజకీయ పార్టీలు




యానాం, నవంబరు 18 (వెలుగు ప్రధాన ప్రతినిధి) : పుదుచ్చేరి శాసనసభకి మరో ఐదు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో పుదుచ్చేరిలోని ప్రధాన రాజకీయపార్టీలు వివిధ పార్టీలతో పొత్తులు కుదుర్చుకోవడానికి ఇప్పటికే దశలవారీ కసరత్తులు చేపట్టాయి. గత అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, డిఎంకె కూటమి 30 స్దానాలకి పోటీ చేసి మెజార్టీస్దానాల్లో గెలుపొంది ఎన్నికలు జరిగిన రెండు నెలల తర్వాత అధికారాన్ని చేపట్టి వచ్చే 2021జూన్ ఆరోతేదీ నాటికి ఐదేళ్లు పూర్తికానున్నాయి. ఎన్నికల నిర్వహణకి సంబంధించి ఇప్పటికే 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఏ స్దాయిలో ఓటర్లు ఓట్లు వేయాలి, భద్రతా చర్యలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కేటగిరిల కింద అదనపు పోలీస్ బలగాలు తదితర వాటిపై ఇప్పటికే ఎన్నికలశాఖ యంత్రాంగం కసరత్తులు చేపట్టింది. అన్ని నియోజకవర్గాలవారీ ఓటర్ల వివరాలను ఇప్పటికే ఎన్నికల శాఖ యంత్రాంగం ప్రకటించింది. వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కాలపరిమితి విధించటం, ప్రస్తుతం వున్న ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు, వడబోతలు తదితర ప్రక్రియకి శ్రీకారం చుట్టడంతో ఎన్నికలశాఖ యంత్రాంగం పరోక్షంగా ఎన్నికల నిర్వహణకి సర్వం సిద్దమైంది. ఈ క్రమంలో పుదుచ్చేరిలో ప్రతిపక్షంలో వున్న ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాలవారీగా అభ్యర్ధులను గెలుపు గుర్రాల ప్రాతిపదికన ఎట్టిపరిస్థితుల్లోనూ అధికారంలోకి రావాలనే లక్ష్యంతో పొత్తులపరంపరకి ఏ మేరకి తెర తీయగలదో, గత ఎన్నికల మాదిరిగా ఎటువంటి పొత్తులు పెట్టుకోకుండానే ఒంటరిగా పోటీ చేస్తుందో, ప్రతిపక్ష ఓట్లు ఉమ్మడిగా, గుత్తగా ఉండి అవతలి పార్టీకి వెళ్లేలా ఓట్ల విభజన అనేది ఏవిధంగా తావులేకుండా వుండేందుకు ఆ మేరకి ముందుకు వెళితే పరిస్థితి ఏవిధంగా వుంటుందనే అంశంపై కసరత్తులు చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, డిఎంకెలు ఒక కూటమిగాను, ఎన్ఆర్ కాంగ్రెస్, ఎఐఎడిఎంకె, బిజెపిలు వేర్వేరుగాను పోటీ చేయడంతో ప్రతి పక్షాల ఓట్లు నిలువునా చీలిపోవడం, అప్పటికే అధికారంలో వున్న ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలువునా డీలాపడిపోయేలా అతి తక్కువ సీట్లు రావటం, అన్నాడిఎంకె పార్టీ సహితం తక్కువ సీట్లు లభించటం జరిగాయి. ఎన్డీయే కూటమిలో ఎన్ఆర్కాంగ్రెస్పార్టీ ఇప్పటికే వుంది. తమిళనాడులో సహితం పుదుచ్చేరితో సహా ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో తమిళనాడులో ఏ ప్రాతిపదికన ఏఏ రాజకీయపార్టీలు పొత్తు కుదుర్చుకుంటాయో అదే ప్రాతిపదికన పుదుచ్చేరిలో సహితం పొత్తుల ప్రక్రియ వుండటం ఖాయమంటున్నారు. ఫలితంగా బిజెపి, ఎన్ఆర్ కాంగ్రెస్, ఎఐఎడిఎంకె తదితర పార్టీలు ఒక కూటమిగా వుంటే పుదుచ్చేరి ఎన్నికల ఫలితం అనూహ్యమైన రీతిలో వుండగలదని అంచనా వేస్తున్నారు. తమిళనాడులో కాంగ్రెస్, డిఎంకె కూటమి ఇప్పటికే అధికారంలో వున్న అన్నాడిఎంకె పార్టీకి ఛాలెంజ్గా నిలిచేలా ఆపార్టీ కంటే ముందుగానే ఎన్నికలకి సర్వం సిద్దంగా వుండటం, ప్రాధమిక సర్వేలో కాంగ్రెస్, డిఎంకె కూటమికే మొగ్గుచూపే ధోరణిలో ప్రజలు వున్నారని సర్వేలు వస్తుండటం, ఫలితంగా ఆ ప్రభావం కాస్తా సమీపాన గల కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఎన్నికల రాజకీయ తెరపై ఏ మేరకి వుండగలదోనని ఆయాపార్టీల వర్గాల వారు తర్జన,భర్జనలు పడుతున్నారు. పుదుచ్చేరిలో ఆయా రాజకీయపార్టీలు కుదుర్చుకునే పొత్తుల మేరకి మాత్రమే యానాంకి సంబంధించి ఏఏ పార్టీలు ఏఏ రూపాల్లో పోటీ చేస్తాయో, ఉమ్మడిగా పోటీ చేస్తాయో, ఏఏ సామాజికవర్గానికి చెందిన అభ్యర్ధులు ఏఏ రాజకీయపార్టీ తరపున పోటీ చేస్తారో అనేది పుదుచ్చేరిలో కుదుర్చుకునే పొత్తుల కసరత్తుల ప్రక్రియపై ఆధారపడి వుంటుందని అంటున్నారు. యానాంలో ఎటువంటి ఎన్నికలు జరిగినా రాజకీయపార్టీని, ఆపార్టీ ఎన్నికల గుర్తును చూసి ఓట్లు వేసే పద్దతి ఏనాడూ లేకుండా వున్న క్రమంలో కేవలం అభ్యర్ధి సామాజిక నేపథ్యం, కులం ఆధారంగానే ఎన్నికలు జరుగుతూ వుండటం ఆ ఎన్నికలు కాస్తా ముఖాముఖిగానే త్రిముఖ పోటీ అనేది ఏ కోశానా లేకుండానే జరుగుతూ వుండటం ఈఎన్నికల కోలాహలంలో ఒక రాజకీయపార్టీ అభ్యర్ధి డమ్మీ అయిపోవటం, రెండు (తరువాయి లోపలి పేజీలో)

## ఎన్నికల వేడి

(మొదటి పేజీ తరువాయి) రాజకీయపార్టీల మధ్యే ఆయా పార్టీ అభ్యర్ధుల కులం, నిధుల వెచ్చింపు తదితర వాటిపై ఫలితం అనేది ఉండగలదనే ఆనవాయితీ వున్నప్పటికి గత రెండున్నర దశాబ్దాల నుండి యానాం అభివృద్ధిని చూసిమాత్రమే సంబంధిత అభ్యర్ధికి పట్టం కట్టే పద్దతిని అనుసరించడంతో ఐదు ఎన్నికల్లోనూ ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్ధి, ఆ అభ్యర్ధి పనితనాన్ని బట్టి సునాయాసంగా ఎన్నికల్లో గెలుపొందడం అనేది యానాం అసెంబ్లీ నియోజకవర్గానికే చెల్లిందంటున్నారు. పుదుచ్చేరి శాసనసభ సాధారణ ఎన్నికలకి సంబంధించి మరో రెండు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ జారీ కానున్న క్రమంలో తమిళనాడు తరహా రాజకీయపార్టీల ఎన్నికల పొత్తు పుదుచ్చేరిలో సహితం ఆ మేరకి వుండగలదని అంటున్నారు. ఆ పొత్తుల కసరత్తు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత రాజకీయపార్టీల పరంగా ఒక పోటీ రూపం సంతరించుకోగలదనే అంచనాలతో అభ్యర్ధులు సహితం ఎన్నికల పొత్తుల ప్రక్రియ ఒక కొలిక్కివస్తుందోనని ఎదురుచూస్తున్నారు.